

నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, జూన్ 13: ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీపీట(డిజిటల్ ప్రాసెస్) ఉద్యోగాల కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. 2023-24 సంవత్సరంలో ఇంటర్ సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాత్రమే శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగమేళా ఉంటుందని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటో ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరుకావాలన్నారు. మిగిలిన వివరాలకు 8074065803 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.



కాన్పుకు పోతే.. కోతలే..!



- జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా పెరిగిన సిజేరియన్లు
- చాలా చోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు, సిబ్బంది కొరతే కారణం
- దీంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న తల్లీ, బిడ్డ
- వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైపు మొగ్గు
- మొదటి కాన్పులో సాధారణ ప్రసవాలే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

కామారెడ్డి(ఆంధ్రజ్యోతి), జూన్ 13: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాన్పుకు పోతే కడుపుకోతలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించకపోవడం, గర్భిణులు ఆసుపత్రులకు వస్తే పట్టింపులేకుండా వ్యవహరించడంతో ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రుల గడపతొక్కే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. అంతేకాకుండా ఆసుపత్రుల్లో ప్రభుత్వ వైద్యులు సమయానికి లేకపోవడం, కిందిస్థాయి సిబ్బందితో ప్రసవాలు చేయించేలా వ్యవహరిస్తుండడంతో బిడ్డకు ఏమైన ఇబ్బంది అవుతుందేమోనని వేచిచూసి విసిగిపోయిన గర్భిణి బంధువులు అందుబాటులో ఉన్న వైద్యులను అవసరమైతే ఆపరేషన్లు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారి నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు ఆపరేషన్ల వైపు వైద్యులు మొగ్గు చూపుతున్నారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్య వైద్యంతో కొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సైతం అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారు. ఇలా చేసి వేలకు వేలు లాగుతూ అక్రమార్జనకు ఒడిగడుతున్నారు. ఈ విధానానికి స్వస్తి చెప్పాలని భావించిన కేంద్ర ప్రభుత్వం గతంలోనే జాతీయ ఆరోగ్యమిషన్ పథకంలో భాగంగా ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయాలంటే అనుమతి ఉండాలనే నిబంధన విధించింది. అదేవిధంగా గత రాష్ట్ర ప్రభుత్వం సైతం మొదటి కాన్పు సాధారణ ప్రసవమే చేయడంతో పాటు అవసరమైతేనే ఆపరేషన్ల వైపు మొగ్గు చూపాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేసే ప్రయత్నాలు పలు ఆసుపత్రుల్లో జరుగుతున్నప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రులు

ప్రభుత్వ ఆదేశాల బేఖాతారు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై మాత్రం అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆపరేషన్లకే ప్రాధాన్యత

జిల్లాలో గత 3 నెలల కాలంలో 3,246 ప్రసవాలు జరగగా ఇందులో ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 1,501, ఆపరేషన్‌లు 1,745 వరకు జరిగాయి. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 723, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన సాధారణ ప్రసవాలు 778 జరిగాయి. ఈ లెక్కలను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ఆపరేషన్ల తీరు అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలో కొద్దిమేర గైనిక్ వైద్యులు అందుబాటులోకి రావడంతో పలు ప్రైవేట్ ఆసుపత్రుల ధనార్జన తగ్గిపోవడం వల్ల ఆపరేషన్లకే మొగ్గు చూపుతూ అధికారుల కండ్లు కప్పేందుకు తూతూ మంత్రంగా సాధారణ ప్రసవాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు సరిగా లేకపోవడం బెడ్డులు సరిపడ లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత వల్ల డెలవరీలు చేయడం ఆలస్యం అవుతుండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిని వదిలిపెట్టకుండా అవసరం లేకున్నా ఆపరేషన్‌లు చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లపై వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటేనే ఆపరేషన్‌లు తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని లోటు పాట్లపై దృష్టి సారించి అప్పుడప్పుడు జరుగుతున్న ఆపరేషన్లను సైతం తగ్గించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆపరేషన్ల వల్ల వల్ల కలిగే అనర్థాలు

ఆపరేషన్లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ప్రసవాలు పుట్టె చిన్నారుల కంటే ఆపరేషన్లలో పుట్టె చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పాడుతాయని అంటున్నారు. అదేవిధంగా శస్త్రచికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఏర్పడడమే కాకుండా సాధారణ ప్రసవం అయిన వారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. మత్తులో ఉండడం వల్ల పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు అంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అనేక రకాల నిబంధనలు తీసుకువస్తున్నా అవి కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. వాటిని అమలు చేయాల్సిన అధికారుల అలసత్వం వల్లే ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ఆపరేషన్లకు సంబంధించిన లెక్కలను చూసి కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు గా ఉంటూ తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో ప్రసవాలు జరుగుతున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మొదటి కాన్పు ఖచ్చితంగా సాధారణ ప్రసవమే చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ బేఖాతారు చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి జిల్లా

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, జూన్ 13: మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి జిల్లా అని, ఇక్కడి ప్రజలు కుల, మతాలకతీతతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకునే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ సింధూశర్మతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న బక్రిద్ పండుగ సందర్భంగా ప్రార్థన స్థలాలు, వధశాలల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని మున్సిపల్ కమిషనర్లను, జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. నిబంధనలు లోబడి పశువుల రవాణా జరిగేలా చూడాలని, అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే అట్టి సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలని యువతకు సూచించారు. రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నిబంధనలు విరుద్ధంగా వివిధ వాహనాల్లో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పశు వైద్యాధికారులు ధ్రువీకరించిన వాటినే నిర్ధారించిన ప్రాంతాల్లో పశువధ జరపాలన్నారు. వ్యర్థ పదార్థాలను వధశాల నుంచి డంపింగ్ యార్డుకు తరలించుటకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా అవసరమైన ప్లాస్టిక్ బ్యాగు అందించాలని తెలిపారు. డంపింగ్ యార్డుల వద్ద గుంత తీసి వ్యర్థాలను పూడ్చాలని, లేకుంటే దుర్వాసనతో పాటు రోగాలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఈనెల 17 నుంచి 19 వరకు ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు విద్యుత్ అంతరం లేకుండా చూడాలని, మంచినీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తుల పట్ల, అసత్య వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హితవు తెలిపారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టుటకు 5 చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిబంధనలకు లోబడి వాహనాల్లో పశువులను తరలిస్తున్నారా ఓవర్‌లోడ్‌తో వెళుతున్నాయా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వాహనాలను అడ్డగించరాదని సంఘాలకు, యువకులకు సూచించారు. సంతల వద్దే పశువులను పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాలని పశువైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవోలు రంగనాథరావు, రమేష్ రాథోడ్, జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి సింహారావు, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్, ఈడీ దయానంద్, డీఎస్పీలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు వేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 13: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్బెండాజోల్ మాత్రలను వేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ నులిపురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి వాటితో బాధపడతారని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలు చెప్పులు లేకుండా నడవడం వల్ల వచ్చే అవకాశముందని తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 2,50,254 పిల్లలున్నారని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈనెల 20న అల్బెండాజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు తెలిపారు. ఈ మందులు వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ రావని, మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పిల్లలు మాత్ర వేసుకునేలా అందరు అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఏదైన కారణం చేత ఆ రోజు తప్పిపోయిన పిల్లలకు ఈనెల 27న మాప్‌అప్ కార్యక్రమాన్ని నిర్వహించి మాత్రలు అందించాలని అన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా మాత్రలు వేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సైతం అల్బెండాజోల్ మాత్రలు పిల్లలకు వేయించాలని, ఎట్టి పరిస్థితుల్లో మాత్రలు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించకుండా చూడాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళ సంఘాలు కృషి చేయాలన్నారు. మాత్రలు వేసుకున్న తర్వాత పిల్లలకు తాగునీటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్,



అధికారులతో మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా సంక్షేమాధికారి బావయ్య, ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలి

తాడ్వాయి: విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణాజీవాడి ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ మధ్యాహ్న భోజనం, దుస్తుల పంపిణీ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులను ఆదుకోవడంలో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య నభ్యసించారని తెలిపారు. డీఈవో రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, స్థానిక ప్రధానోపాధ్యాయుడు రామస్వామి, సీనియర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేని.. కస్తూర్బా కళాశాల!

- నిర్మాణం చేపట్టారు.. ఫ్లోరింగ్, మరుగుదొడ్లను అసంపూర్తిగా మిగిల్చారు
- కరెంట్ నీటి వసతి లేక లబోదిబోమంటున్న విద్యార్థినులు
- కళాశాల భవవాన్ని కస్తూర్బాకు అప్పగించని కాంట్రాక్టర్
- రూ. కోటీ 50 లక్షలతో నిర్మించినా ఫలితం శూన్యం
- కస్తూర్బా విద్యాలయంలో అడ్మిషన్‌లు లేవని గేటు వద్ద బోర్డు

నిజాంసాగర్, జూన్ 13 : కస్తూర్బాలో కనీస సౌకర్యాలు కనుమరుగయ్యాయి. రూ.కోటి 50 లక్షల వ్యయంతో 2019లో నిర్మాణం చేపట్టారు. ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, నీటి వసతి కల్పించడం మరిచిపోయారు. చూడ ముచ్చటగా నిర్మించినా, కొన్ని పనులు అసంపూర్తిగా మిగిల్చారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలనే ఆలోచన లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో పనులు చేశానని, నిధులు సరిపోకపోవడంతో మిగిలిన పనులు చేపట్టలేదని, విద్యాలయ స్పెషల్ అధికారికి వివరించారు. ఈ కళాశాలలో సుమారు 160 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులు ముందుకు రావడం లేదని సమాచారం. నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా పాలకులు అధికారులు ససేమిరా అనడం గమనార్హం. కార్యాలయ గదితో పాటు హాస్టల్, తరగతి గదులు తొమ్మిదింటిని పూర్తి చేశారు. ఫర్నిచర్‌ను ఆయా గదుల్లో ఉంచారు. గదులకు ఫ్లోరింగ్ పనులు సక్రమంగా జరుగకపోవడంతో విద్యాభ్యాసం జరగాలంటే అనేక పాట్లు పడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పక్కనే ఉన్న కస్తూర్బాలోనే కాలం వెళ్లదీస్తున్నారు. అక్కడ కూడా అరకొర వసతు లుండటంతో ఇప్పటికీ 1 నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యాభ్యాసం చేయాల్సి ఉండగా, 230 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేయడం గమనార్హం.



కస్తూర్బా విద్యాలయం



కస్తూర్బా కళాశాల భవనం



అసంపూర్తిగా స్నానపు గదులు, మరుగుదొడ్లు

కస్తూర్బా విద్యాలయంలో అడ్మిషన్లు లేవు

2008లో కస్తూర్బా విద్యాలయాన్ని నిజాంసాగర్‌లో స్థాపించారు. మూడు సంవత్సరాల పాటు అద్దె భవనంలోనే కొనసాగింది. ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయానికి నూతన భవనం నిర్మాణం చేపట్టినా చాలీచాలని గదులు నిర్మించారు. ఈ విద్యాలయంలో 200మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేయాల్సి ఉండగా, మరో 30 మందికి అదనంగా అడ్మిషన్లు కల్పించారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నా వాటిని మరమ్మతులు చేయించాలనే ఆలోచన అధికార యంత్రాంగానికి లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలున్నాయి. రెండవ అంతస్థు నిర్మాణానికి పిల్లర్లు నిర్మించారు. గదుల నిర్మాణం అప్పట్లో మరిచిపోయారు. వసతులు లేనందునే అడ్మిషన్లు తీసుకోవడం కష్టంగా మారింది.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

- ప్రత్యేకాధిరిణి సరోజ

కస్తూర్బా కళాశాలలో అరకొర వసతులు విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనంలో స్నానపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా లేనందున విద్యార్థినులను తీసుకోవడానికి భయపడుతున్నాం. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థినులకు గాను 230 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

చిన్నారి అపహరణ కేసులో ఏడాది జైలు

బోధన్‌రూరల్,జూన్13: చిన్నారిని అపహరణ చేసినటువంటి కేసులో ముద్దాయికి సంవత్సరం జైలుశిక్షతో పాటు 100రూపాయలు జరిమాన విధించినట్లు బోధన్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి దేవన్ అజయ్‌కుమార్ తీర్పును వెల్లడించారు. గురువారం బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం 12-11- 2022న మేకల లక్ష్మి సంసార విషయంలో గొడవపడి తన చిన్న కూతురు అయిన 10నెలల పాపను తీసుకుని తన తల్లి గారి ఇల్లు అయిన బోధన్ మండలం చిన్నమావంది గ్రామంలో జీవనం కొనసాగిస్తుందని తెలిపారు. మేకల లక్ష్మి చిన్న కూతురు ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో 7-11-2022నాడు చికిత్స కోసం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారని తెలిపారు. 9-11-2022న రాత్రి ఫిర్యాదురాలు కల్లుతాగి నాదెల్లి మసీదు దగ్గర తన పాపతో కలిసి పడుకున్నారని తెలిపారు. మరునాడు ఉదయం నిద్రలేచేసరికి పాప కనిపించకపోవడంతో తన భర్త తన పాపను తీసుకెళ్లాడని అనుమానంతో పాప ఆచూకీ కోసం బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేయడం వల్ల ఎస్‌ఐ నవీన్ ఇన్విస్టిగేషన్ పూర్తిచేసి గంగామణి, అంజలి, షమీని బేగం, షహెనాజ్, పర్వీన్ దోషులను పట్టుకుని చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు. ఇట్టి కేసులో పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వాదించారు. గురువారం బోధన్ అసిస్టెంట్ సెషన్ జడ్జి దేవన్ అజయ్‌కుమార్ పూర్తి విచారణ చేపట్టి ముద్దాయి చిన్నకుట్ల గంగామణికి ఏడాది పాటు కఠిన కారాగార జైలుశిక్షతో పాటు వంద రూపాయల జరిమాన విధిస్తూ ఒకవేళ వందరూపాయలు కట్టలేని పక్షంలో 15రోజుల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పును వెల్లడించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వీరయ్య, లైజనింగ్ అధికారి శంకర్, పోలీసులు లక్ష్మణ్, గణేష్‌ఉన్నారు.

షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, జూన్ 13: నగరంలోని కంఠేశ్వర్‌లోగల మోర్ సూపర్ మార్కెట్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన హవెల్స్ షోరూంను గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలని కోరారు. కోపూరు విఠల్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్, ఆనంద్, పవన్, హరీష్, బాబిసింగ్ పాల్గొన్నారు.

బుక్‌ఆఫ్‌రికార్డ్స్‌లో జిల్లా చిన్నారి

నిజామాబాద్ అర్బన్, జూన్ 13: జిల్లాకు చెందిన కళ్యాణం ఆద్యా అనే చిన్నారి 52 రోజుల్లో ఆధార్‌కార్డు పొంది ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుల చేతుల మీదుగా ఈ అవార్డును చిన్నారికి అందజేశారు. చిన్నారి తల్లి డాక్టర్ అనుష, తండ్రి అన్వేష్‌లు నిజామాబాద్ నగరానికి చెందిన వారు. ఫిబ్రవరి 2, 2024న పుట్టిన ఆద్యాకు 52 రోజుల్లోనే ఆధార్‌కార్డు వచ్చింది. దీంతో ఆమె అతి చిన్నవయస్సులో ఆధార్ కార్డు పొందిన రికార్డు నమోదు చేసింది.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూన్ 13: నగరంలోని వినాయక్‌నగర్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంత రాయం ఏర్పడుతుందని నగర టౌన్-3 ఏడీఈ వీరేశం తెలిపారు. నగరంలోని వినాయక్‌నగర్, పద్మానగర్‌రోడ్, మార్కండేయ టెంపుల్, కోటగల్లి, ఆర్యసమాజ్, పెద్దబజార్, రిలయన్స్ మార్ట్, వినాయక్‌నగర్, 60 ఫీట్ బైపాస్‌రోడ్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఇందిర వనప్రభలో పండ్ల మొక్కలకు ప్రాధాన్యత'

సిరికొండ జూన్ 13 : ఈ సారి గ్రామాల్లో చేపట్టే ఇందిర వనప్రభ కార్యక్రమంలో పండ్ల మొక్కలు నాటించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. భారీ వర్షాలు కురువగానే మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే అధికారులు మొక్కలు నాటడానికి ఏర్పాటు చేస్తున్నారు.

పాఠశాల నిర్మాణ పనులు పూర్తిచేయండి : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



గూపన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో దుస్తులు పంపిణీచేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్, జూన్ 13: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి తనిఖీచేశారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల పనులు పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉం డటంపె అసంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సిద్ధంచేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు లక్ష్మన్, లింగం, జీవన్‌రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ శంకుతల, ఉపాధ్యాయులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన గురిజల సతీశ్‌రెడ్డి(బర్ధిపూర్)కు గురువారం రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి నియామకపత్రం అందజేసి అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యువజన విభాగాలను పటిష్ఠం చేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారని యూత్ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి తెలిపారు.

సిరికొండ: యువజన కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోప్యా తాండాకు చెందిన జీవన్‌ను నియమిస్తూ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు. మాలావత్ జీవన్‌ను మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కియాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, మండల అధ్యక్షుడు రవి, ఎస్టీసెల్ జిల్లా నాయకులు సంతోష్ నాయక్, శ్రీధర్, సంతోష్, తదితరులు ఉన్నారు.

ఇందల్వాయి: మండలంలోని రంజిత్‌నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోగల త్రియంబక్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గురువారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి త్రియంబక్‌పేట్ గ్రామప్రజలు వినతిపత్రం అందజేశారు. త్రియంబక్‌పేట్ గ్రామంలో ముదిరాజ్ కులానికి చెందిన సుమారు 25 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారని ఆ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేయాలని వారు కోరారు. రంజిత్‌నాయక్ తండాలో వందశాతం ఎస్టీ కేటగిరి కావడం వల్ల త్రియంబక్‌పేట్ గ్రామంలోని బీసీ ప్రజలకు రిజర్వేషన్ రావడం లేదని అభివృద్ధి పరంగా, రాజకీయ పరంగా గ్రామానికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు కూడా గ్రామానికి అందడం లేదని వారు వాపోయారు. త్రియంబక్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేసి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, త్రియంబక్‌పేట్ గ్రామ పెద్దలు సాయిలు, పోతన్న, గంగ లక్ష్మయ్య, పెద్దబాలయ్య, చందర్, సాగర్, బాలకృష్ణ, గంగాదాస్ పాల్గొన్నారు.

మోపాల్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాజేష్‌ను నియమిస్తూ గురువారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో కాలం చెల్లిన మందులు

● సిబ్బందిని నిలదీసిన రోగి బంధువులు



కాలం చెల్లిన మందులు

కోటగిరి,జూన్13: ఆసుపత్రికి వైద్యం కోసం, మాత్రల కోసం వచ్చే వారి పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్య పరీక్షలతో పాటు రోగులకు అవసరమైన మందులు ఇవ్వాల్సిన సిబ్బంది తమ ఇష్టానుసారంగా, కాలం చెల్లిన మందులను పంపిణీ చేస్తున్నారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన శ్రీహిత అనే మహిళకు షుగర్ వ్యాధి మాత్రలు కావాలని తల్లి శోభ ఐదు రోజుల క్రితం పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఫార్మాసిస్టు అందుబాటులో లేకపోవడంతో హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి షుగర్ మాత్రలు ఇవ్వాల్సి ఉండగా కాలం చెల్లిన మాత్రలతో పాటు ఇతర మాత్రలను పంపిణీ చేసింది. ఈ మాత్రలు కావని చెప్పిన హెల్త్ సూపర్‌వైజర్ వినకుండా అవే మాత్రలు ఇవ్వడంతో చేసేదేమి లేక రోగి తల్లి శోభ వెనుదిరిగింది. తమ కూతురుకు ఆ మాత్రలను ఇవ్వగా వాడటంతో అనారోగ్యానికి గురైంది. మాత్రలు వేసుకున్న నాటి నుండి తమ కూతురు ఆరోగ్య పరిస్థితి క్షిణించడంతో ఆందోళనకు గురైన తల్లి గురువారం పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. గడువు తీరిన మాత్రలతో పాటు ఇతర మాత్రలు ఇవ్వడంపై ఆరోగ్యసిబ్బందిని నిలదీసింది. ఫార్మాసిస్టు గౌస్ తాను కాలం చెల్లిన మాత్రలను పక్కన పెట్టానని వివరించాడు. హెల్త్ సూపర్‌వైజర్ తాను పొరపాటుతో మాత్రలు ఇచ్చానని అంగీకరించడం గమనార్హం. వైద్య సిబ్బంది పనితీరుపై బాధితురాలి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవీపేట, జూన్13 : మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన నర్సమ్మ(60)అనే మహిళ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. బాధిత కుటుంబం నిరుపేద కావడంతో మీకోసం మేము సేవా సంస్థ ఆధ్వర్యంలో 9వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దూపల్లి లక్ష్మణ్, గంగాధర్, మోహన్, మహిపాల్ తదితరులున్నారు.

మిషన్ భగీరథ సర్వేను పరిశీలించిన డీఎల్‌పీవో

రెంజల్, జూన్13: మండల కేంద్రంలోని మిషన్‌భగీరథ ఇంటింటి సర్వేను గురువారం డీఎల్‌పీవో సాయిబాబా పరిశీలించారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందించాలన్న ఉద్దేశంతో గ్రామాలలో ఉన్న ఇంటింటికి వెళ్లి సర్వేను నిర్వహించారు. సర్వేను డీఎల్‌పీవో సాయిబాబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంజల్ మండలకేంద్రంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే తీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో రెంజల్ మండలం సర్వేలో 6వ స్థానంలో ముందు వరుసలో ఉందని ఎంపీడీవో శ్రీనివాస్‌ను అభినందించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వేను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంకి వినతి

ఆర్మూర్‌రూరల్, జూన్13: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. 16ఏళ్ల నుంచి 104 ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్టు లేదా రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగభద్రత కల్పించి నెలనెల వేతనాలు అందేలా చూడాలని విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తమ వినతిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని ఉద్యోగులు తెలిపారు. సీఎం ను కలిసిన వారిలో ప్రకాష్, కృష్ణ, ప్రవీన్, పురుషోత్తం, రమేష్, జి.కృష్ణ ఉన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలి'

బోధన్‌రూరల్,జూన్13: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సాలూర మండల తహసీల్దార్ రమేష్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించబడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజూష, సహకార సంఘం అధ్యక్షులు అల్లె జనార్ధన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు రేఖ, గ్రామ పెద్దలు గంగారాం పాల్గొన్నారు.

ఉర్దూఘర్ స్థల పరిశీలన

,బోధన్‌రూరల్‌జూన్13: బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్ స్థలాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం గురువారం బోధన్ తహసీల్దార్‌తో పాటు మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని పరిశీలించి ఉర్దూఘర్ కమిటీకి నోటీసులు పంపిస్తున్నామని తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. ఉర్దూఘర్ ఎదుట నిర్మించిన మడిగెల గురించి ఆరా తీశారు. ఉర్దూఘర్ ఎదుట ఉన్న మడిగెలను గ్రీన్‌ల్యాండ్‌లో తమ సౌకర్యార్థం నిర్మించుకున్నామని, వాటిని తిరిగి ఇప్పించాలని పలువురు గురువారం ఉదయం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బోధన్ తహసీల్దార్‌తో పాటు మున్సిపల్ టీపీవో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉర్దూఘర్‌ను సందర్శించి కొలతలు నిర్వహించారు.

చిన్నవాల్గోట్‌లో విద్యుత్ ఓవర్‌లోడ్ తగ్గించేందుకు చర్యలు

సిరికొండ జూన్ 13 : చిన్నవాల్గోట్‌లో ఓవర్‌లోడును తగ్గించడానికి 25 కెవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. సిరికొండ మండలం చిన్నవాల్గోట్ గ్రామంలో విద్యుత్ ఓవర్‌లోడ్ వల్ల గ్రామంలో విద్యుత్ సరాఫరాలో తరుచు సమస్యలు ఉత్పన్నమయ్యేవని స్థానికులు చెప్పారు గ్రామస్తుల ఒత్తిడి మేరకు లైన్‌మెన్ ట్రాన్స్‌కో డీఈ,ఏడీఈ ,ఏఈల దృష్టికి తీసికెళ్లారు.

బడిబాటను సద్వినియోగం చేసుకోవాలి : జడ్పీ ఛైర్మన్



పాఠశాలలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న జడ్పీఛైర్మన్

మాక్లూర్, జూన్ 13: ప్రభుత్వం పేదపిల్లలకు ఉచిత నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొట్టుముక్కల, గుంజిలి, కొత్తపల్లి, వల్లభపూర్ గ్రామాల్లో పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు, ఏకరూప దుస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, ఏఈ శ్రీనివాస్‌తో పాటు అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13: తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2, 3 సర్వీసెస్ పరీక్ష కొరకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు అందించనున్న ఉచిత శిక్షణ కొరకు డిగ్రీ పూర్తిచేసుకున్న అభ్యర్థులు అర్హులని ఆమె తెలిపారు. అర్హత కలిగిన మైనార్టీ (ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్శికులు) తమ దరఖాస్తులను ఈనెల 18లోగా హైమదీబజార్‌లోని ఉర్దూ అకాడమిలో అందజేయాలన్నారు. ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలు, గ్రూప్-2, 3 పరీక్ష కొర కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ కాపీ, 2 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9948956994, 9700351786 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పిప్రి పాఠశాలకు కుర్చీల వితరణ

ఆర్మూర్‌రూరల్, జూన్13: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలోని జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీస్ కార్యాలయం నిమి త్తం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో గురువారం పది కుర్చీలను అందజేశారు. రోటరీ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అగర్వాల్ కుర్చీ లను వితరణ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు వంద కుర్చీలు, 20టేబుళ్లు అందజేశామన్నారు. భవిష్యత్‌లో తమ రోటరీ క్లబ్ ద్వారా పాఠశాలలకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్పకర్‌రావు, ప్రవీన్‌ప వార్, గోనే దామోదర్, హెచ్ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయులు గరడి ఆనంద్, శ్రీనివాస్, వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ మధ్యాహ్న భోజన బిల్లుల మంజూరు

నిజామాబాద్ అర్బన్, జూన్ 13: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. 2023-24కు సంబంధించి 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు కుక్కింగ్ కాస్ట్‌కు గాను రూ.3కోట్ల 81 లక్షల, 59,498 మరియు సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.78లక్షల 86వేల బడ్జెట్‌ను మండలాల వారిగా ఎంఈవో ఎస్ఎన్ఏ అకౌంట్‌లకు రిలీజ్ చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు నిధులను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పీఎఫ్ఎంఎస్ ద్వారా విడుదల చేసేందుకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో బిల్లులు ఏజెన్సీల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాల విడుదల

నిజామాబాద్ అర్బన్, జూన్ 13: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. రాష్ట్రంలో జిల్లా ఎస్సెస్సీలో 6వ స్థానం, ఇంటర్‌లో 8వ స్థానం సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్సెస్సీలో 1592 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 1310 మంది ఉత్తీర్ణులయ్యారు. 82.29 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 1699 మంది పరీక్షలు రాయగా 64.74 శాతం ఉత్తీర్ణతతో 1100 మంది పాసైనట్లు ఆయన తెలిపారు. రీకౌంటింగ్ కొరకు ఇంటర్మీడియెట్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.400, 10వ తరగతికి రూ.350, రీవెరిఫికేషన్ కొరకు ఒక్కో సబ్జెక్టుకు ఇంటర్, ఎస్సెస్సీకి రూ.1200ల చొప్పున చెల్లించాలని ఈ ఫీజును టీఎస్‌ఆన్‌లైన్ లేదా మీసేవా సెంటర్‌లో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఓపెన్ కోఆర్డినేటర్ రవీందర్ 8008403518, 9849234696 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

ఖిల్లా, జూన్ 13: అగ్ని ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణపై గురువారం కోర్టు ప్రాంగణంలో సిబ్బందికి, న్యాయవాదులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారులు సిలిండర్‌కు మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మంటలు సంభవించినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలో ప్రదర్శించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతహం

ముప్కాల్, జూన్13: వారం రోజుల క్రితం గల్ఫ్‌లో గుండెపోటుతో మృతిచెందిన కోట భూమేశ్వర్ మృతదేహం గురువారం స్వగ్రామమైన ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చేరింది. గత నెల సెలవుపై స్వగ్రామానికి వచ్చి నెల రోజులు కుటుంబసభ్యులతో గడిపాడు. వారం క్రితం గల్ఫ్‌వెళ్లగా అక్కడ గుండెపోటుతో మృతి చెంది శవమై స్వగ్రామానికి రావడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్ల, కుమారుడున్నారు. కుటుంబానికి పోషించే పెద్దదిక్కు కోల్పోడంతో పిల్లలు ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నడిపల్లి చెరువులో మహిళ హత్య

డిచ్‌పల్లి,జూన్ 13: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడిపల్లి చెరువులో అనుమానాస్పద స్థితిలో బుధవారం చెరువు నీటిలో పడి మృతిచెందిన కొత్త బాధితండాకు చెందిన లలిత కేసును హత్య కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతురాలి లలితకు 2010లో వివాహం కాగా ఇద్దరు కొడుకులు ఉన్నారని ఎస్సై పేర్కొన్నారు. నడిపల్లి చెరువులో పడి ఉన్న లలిత మృతదేహాన్ని గుర్తించగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసును విచారించగా హత్య కేసుగా తేలిందని తెలిపారు.

ఆకుల కొండూరు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిజామాబాద్ రూరల్, జూన్ 13: రూరల్ మండలం ఆకుల కొండూరు గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి (25) మృతదేహం పడివున్నట్లు స్థానికులు గమనించి రూరల్ పోలీసులకు తెలిపినట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుల కొండూరు గ్రామశివారులో జన్నేపల్లి రోడ్డు సమీపంలోని గజానంద్ రైసుమిల్లు వద్ద 25 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి కిందపడి తలకు తీవ్రగాయమై మృతిచెందినట్లు తెలిపారు. పక్కన టీఎస్ 01-ఈఎన్ 0058 నెంబర్‌గల టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఉన్నట్లు తెలిపారు. ఆ వ్యక్తి మృతదేహం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచారు. వ్యక్తిఆచూకి తెలిసినవారు రూరల్ పోలీసులను (8712659849) సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ

నిజామాబాద్ రూరల్, జూన్ 13: రూరల్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం మండలంలోని గుండారం జడ్పీహెచ్ఎస్‌లో ఐకేపీ సిబ్బంది దుస్తులు పంపిణీ చేశారు. ఖానాపూర్‌లో కార్పొరేటర్ కొర్వలలిత విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

రసాయన శాస్త్ర విభాగంలో రాధిక మోరేకు డాక్టరేట్

డిచ్‌పల్లి, జూన్ 13: తెలంగాణ విశ్వవిద్యాలయంలో గురువారం రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థిని రాధిక మోరేకు డాక్టర్ బాలకిషన్ పర్యవేక్షణలో డిజైయిన్ సింథసిస్ అండ్ బయోలాజికల్ ఏవాల్యూయేషన్ ఆఫ్ పైరిడిన్, పైపరిజన్, ఫినాయిల్ ప్రోపైనియాక్ ట్రయజోల్, ఎనలాగ్స్ ఆఫ్ యాంటీ క్యాన్సర్ అండ్ యాంటీ మైక్రో బైల్ ఏజెంట్ అనే అంశంపై పరిశోధన జరిపారు. బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎక్సామినర్‌గా ప్రొ.శ్రీనివాస్ రావు డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ సెంట్రల్ యూనివర్సిటీ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథం పై పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి

విభాగాధిపతుల సమావేశంలో టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి

డిచ్‌పల్లి,జూన్ 13:వేసవి సెలవుల అనంతరం తెలంగాణ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన విభాగాధిపతుల సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ ఏడాది విద్యా సంవత్సరంలో సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్నల్ మార్కులు, ప్రాక్టికల్, థియరీ పరీక్షలు అనుసరించి సిలబస్ పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ప్రొ.అరుణ, విభాగాధిపతులు ప్రొ.ఆంజనేయులు, ప్రొ.మూసకురేషీ, డా.సంపత్ కుమార్, డా.నాగరాజు, డా.భ్రమరాంబిక, డా.శాంతబాయి. డా.లక్ష్మణ చక్రవర్తి, డా.శిరీష, డా.జమీల్,డా.పున్నయ్య, డా.రమణచారి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల చేయాలి

తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగంలో కంట్రోలర్ ప్రొ.అరుణ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి మాట్లాడుతూ.. ఈ నెల 15 వతేదీకి పూర్తి అవుతున్న డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ ఫలితాలతో విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశానికి నిర్వహించే వివిధ సెట్‌లకు అనుబంధంగా ఉంటాయని పేర్కొన్నారు. అడిషనల్ కంట్రోలర్ పలు కళాశాలల అధ్యాపకులతో అనుసంధానమై అనుకున్న సమయానికి విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ నందిని, డా.శాంతబాయి. అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి

తెలంగాణ విశ్వవిద్యాలయంలో చీఫ్ వార్డెన్ మహేందర్ అధ్యక్షతన హాస్టల్ వార్డెన్‌కేర్ టేకర్స్‌తో రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. విద్యార్థులు వర్సిటీకి వచ్చే సమయానికి ముందుగానే హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గదులను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు తాగడానికి శుభ్రమైన నీటిని అందించాలని, భోజనం రుచిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డెన్ కిరణ్‌రాథోడ్, డా.గంగాకిషన్, కిరణ్మాయి, కేర్‌టేకర్‌లు పాల్గొన్నారు.

పరీక్షలకు 384 మంది విద్యార్థులు గైర్హాజరు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్ష , మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 38 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 4544 అభ్యరులకు గాను 3972మంది హాజరుకాగా 372 విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 12 మంది గైర్హాజరయ్యారన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్

బాన్సువాడలో పారిశుధ్య పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్, జూన్ 13: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను గురువారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రాబోయే వర్షాకాలానికి ముందు మురికి కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు, ప్రజలు చెత్త, చెదారాలను మురికి కాల్వల్లో పారేయద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉదయ్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.



సంఘంలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సంఘంలో ఆరోగ్య శిబిరం

నసురుల్లాబాద్, జూన్ 13: మండలంలోని సంఘం గ్రామంలో వైద్యులు గురువారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి పలు వ్యాధులకు, చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. గృహ సందర్శనలు, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గ్రామంలో గల మురికి కాల్వలు శుభ్రం చేయించాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించాలని గ్రామ సెక్రెటరీకి సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరీష్, సీహెచ్ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గ

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



ముఖ్యమంత్రిని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జూన్ 13: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రభుత్వాసుపత్రి, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ పాఠశాలలకు, వ్యవసాయ సాగునీటి ప్రాజెక్టుల వంటి అభివృద్ధి విషయాలపై మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నేడు బీర్కూర్‌లో తైబజార్ వేలం పాట

బీర్కూర్, జూన్ 13: బీర్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం తైబజార్ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు జీపీ కార్యదర్శి గంగారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ ప్రత్యేక అధికారిని తహసీల్దార్ లత సమక్షంలో ఉదయం 11 గంటలకు వేలం పాట జరగనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటలో పాల్గొని తైబజార్‌ను దక్కించుకోవాలని కోరారు.



కాటేపల్లిలో మిషన్ భగీరథ సర్వే చేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే

పెద్ద కొడప్‌గల్, జూన్ 13: మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు సిబ్బంది మిషన్ భగీరథ సర్వేలో బిజీగా మారారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా అందరికి నీరు అందుతుందో లేదోనని అధికారులు సర్వే చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఉండే ఇంటికి మిషన్ భగీరథ నీరు వస్తుందా లేదా అన్న వివరాలతో పాటు, ఇంటికి కుళాయి ఉందా లేదా అని సిబ్బంది తమకు ఇచ్చిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ



నసురుల్లాబాద్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నిజాంసాగర్, జూన్ 13: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల్లో 44 పాఠశాలలకు గురువారం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌ల పంపిణీని విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు. ఉమ్మడి మండలాల్లో 44 పాఠశాలలకు గాను 16,667 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. 23వేల నోట్‌బుక్‌లు రాగా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులకు 12, 13తేదీల్లో అందజేశారు. మరోసారి రెండో విడత పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖాధికారి దేవీసింగ్ తెలిపారు. 16,006 పాఠ్య పుస్తకాలు ఉమ్మడి మండలాలకు రావాల్సి ఉంది. ఆయా పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు బడి మానేసిన చిన్నారులకు కూడా అడ్మిషన్లు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నసురుల్లాబాద్: మండలంలోని సంఘం గ్రామంలో గురువారం విద్యార్థులకు ఎంపీపీ విఠల్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఉచితంగా యూనిఫాంలను అందజేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, కో ఆప్షన్ ఆరీఫ్, నాయకులు బస్వరాజు, యామ రాములు, మన్నన్, అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎంపీటీసీ మోహన్‌రెడ్డి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులకు అన్ని వసతులతో పాటు ఇంగ్లీష్ విద్యను బోధిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



వెంకటాపూర్‌లో కూలిపోయిన రేకుల షెడ్డు

వెంకటాపూర్‌లో గాలివాన బీభత్సం

ఎల్లారెడ్డి, జూన్ 13: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం గాలివాన బీభత్సంతో విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. గ్రామంలో రేకుల షెడ్లు కొట్టుకుపోయాయి. రోడ్ల మీద భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. రాకపోకలు స్తంభించడంతో మాజీ సర్పంచ్ సురేఖ స్పందించి వృక్షాలను తొలగించి రాకపోకలు జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో అధికారులకు సమాచారం అందజేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గాలివాన బీభత్సంతో గ్రామంలో భారీ నష్టం కలిగిందని గ్రామస్థులు తెలిపారు.



నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

స్టాఫ్ నర్సులను వెంటనే నియమించాలి



ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వినీత

నాగిరెడ్డిపేట, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా వైద్యాధికారులు వెంటనే స్టాఫ్ నర్సులను నియమించాలని ఎంపీపీ వినీత కోరారు. గురువారం ఆసుపత్రిలో ఎంపీపీ ఆధ్వర్యంలో రోగి కళ్యాణ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఆసుపత్రిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం ఒక స్టాఫ్ నర్సు మాత్రమే డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారని, స్టాఫ్ నర్సులు లేకపోవడంతో ఆసుపత్రిలో డెలివరీ కోసం వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీపీ తెలిపారు. జిల్లా వైద్యాధికారులు తగు చర్యలు తీసుకుని సరిహద్దుల్లో ఉన్న నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి స్టాఫ్ నర్సులను వెంటనే నియమించాలని ఆమె కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆసుపత్రి అభివృద్ధి కోసం ఒక రూ.లక్ష మంజూరు కాగా అందులో నుంచి రూ.31 వేలు ప్రభుత్వం వెనక్కు తీసుకుందని, మిగతా రూ.69 వేలు ఉండగా నేషనల్ క్వాలిటీ ఇన్సూరెన్స్ సర్వీస్ ద్వారా ఆసుపత్రికి మంజూరైన నిధుల నుంచి కొన్ని నిధులు మిగలగా ఆ నిధులతో ఆసుపత్రిలో సుమారు రూ.లక్షా అరవై వేలతో కొత్తగా విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయించినట్లు రూ.50 వేలు ప్లంబింగ్ పనులు, మరో రూ.40 వేలతో ఇతరత్ర పనులను జరిపినట్లు ఆసుపత్రి వైద్యాధికారి సృజన్ కుమార్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆసుపత్రి అభివృద్ధి కోసం రావాల్సిన నిధులు ఇంకా మంజూరు కాలేవన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సౌకర్యం అందించాలని, ఆసుపత్రి అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, డాక్టర్ సృజన్‌కుమార్, హెచ్‌ఈవో రామారావు, హెల్త్ సూపర్ వైజర్లు సునంద, శాంతిశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



జంగంపల్లిలో మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 13: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం భిక్కనూరుతో పాటుగా మండలంలోని జంగంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ కనెక్షన్ ఉందా, మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా, ఇంట్లో ఎంత మంది ఉన్నారు, ఎన్ని రోజులకు ఒక్కసారి నీటి సరఫరా జరుగుతుంది, నీరు సరిపోతుందా, తదితర అంశాలన్ని ఎలాంటి తప్పులు లేకుండా ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, భిక్కనూరు ఈవో మహేష్‌గౌడ్, గ్రామ కార్యదర్శి బాబు, కారోబర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

రాజంపేట, జూన్ 13: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ముందు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలంటే చెట్లను జంతువులను సంరక్షించుకోవాలని డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని శేర్‌శంకర్ తండాలో అటవీ సంరక్షణ చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ఉన్న అన్ని జీవరాశులలో మనిషి కూడా ఒకరని అడవి జీవాలకు మనగలాగే బ్రతికే హక్కు ఉందని అడవి అభివృద్ధికి దోహదపడే అటవీ,జీవరాశులను,భూములను సంరక్షించుకోవాలని తెలిపారు.అటవీ భూములను ఇష్టానుసారంగా దున్నకూడదని, అటవీభూములను కబ్జాలకు పాల్పడవద్దని తండాలలో శాంతియుత వాతావరణం కలిగి ఉండాలని అధికారులకు సహకరించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌కలిగి ఉండాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్‌రెంజ్ అధికారి రమేష్,భిక్కనూర్ సీఐ సంపత్, ఎంపీడీఓ రాజేశం, ఎస్ఐసంపత్, ఏపీఓ సక్కుబాయి, సంతోష్ పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చూడాలి

కామారెడ్డిటౌన్, జూన్ 13: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచినీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని డ్రైనేజీల నిర్మాణం, సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనిత రవి తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోట, ఫిష్‌పాండ్ పరిశీలన

దోమకొండ, జూన్ 13: మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో గురువారం అస్సాం బృందం పర్యటించింది. గ్రామంలోని వ్యవసాయ అనుబంధ జీవనోపాధులైన డ్రాగన్ పండ్లతోట పెంపకం, చేపలపెంపకంకు సంబంధించి ఫిష్‌పాండ్‌ను పరిశీలించారు. నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదాయ పెంపుదలను,పెంపకం విధానంను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజు, వీఓఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

తాడ్వాయి, జూన్13: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక ఉపాధ్యాయులు, కళాబృందం సభ్యులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలలోనే చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలను విద్యార్థుల కోసం సమకురుస్తుందని తెలిపారు. ఈ సౌకర్యాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, శ్రీకాంత్, రాజాగౌడ్, కళాబృందం ప్రతినిధులు రమేష్‌రావు, మహేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

బైక్ చోరీ

లింగంపేట, జూన్ 13: మండల కేంద్రంలోని సహకార సంఘం దుకాణ సముదాయం వద్ద దీపక్ ఫొటో స్టూడియో వద్ద నుంచి హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు గడ్డం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి

● స్కూల్ డ్రెస్ జతకు రూ.75 చెల్లింపు



స్కూల్ డ్రెస్సులను కుట్టుతున్న మహిళ

మద్నూర్, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసే స్కూల్ డ్రెస్సుల కుట్టుతో మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి లభిస్తోంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో విద్యాశాఖ అధికారులు ఈసారి డ్రెస్సుల కుట్టు బాధ్యతను ఏజెన్సీలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పజెప్పారు. సంఘాలను బలోపేతం చేసేందుకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలను పావలాకే వడ్డీకి ఇవ్వడంతో పాటు ఇతర ఆర్థిక వెసులుబాటు కల్పించాలని, ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో 73 మంది మహిళలు స్కూల్ డ్రెస్సులు కుడుతున్నారు. ఒకేసారి అంత మంది వస్త్రాలను కుడుతుండటంతో వస్త్రాలు చకచకా సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే దాదాపు 80 శాతం వస్త్రాలను కుట్టినట్లు ఏపీఎం మనోహర్ తెలిపారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 40 మహిళా సంఘాలతో 73 మంది మహిళల చేత బట్టలు కుట్టిస్తున్నట్లు తెలిపారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో 5,437 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటి వరకు 4,340 స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

ఆశావర్కర్లకు పరీక్షను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి

కామారెడ్డిటౌన్, జూలై 13: ఆశా వర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్ పెట్టె నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశవర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్ పెట్టె నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్రంలో ఆశవర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు మైదాన ప్రాంతంలో గత 19 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయించిన అనేక ట్రైనింగ్ పొందారని అన్నారు. రిజిస్టర్స్ రాయడం సర్వేలు చేయడం ఆన్‌లైన్ పనిచేయడం బీపీ,షుగర్,థైరాయిడ్ అన్ని రకాల జబ్బులు గుర్తిస్తున్నారని ప్రభుత్వం సప్లయ్ చేస్తున్న మందులకు ప్రజలకు అందిస్తున్నారని ఇలా అనేక రకాల పనులు చేస్తుంటే కొత్తగా ఎగ్జామ్ నిర్వహించి కొత్తగా ఆశల జ్ఞాపకశక్తిని మళ్లీ నిరుపించుకోవడం సమాంజసం కాదని అన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డిరూరల్, జూన్ 13: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్,మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ-2025 కోసం సన్నద్ధమయ్యే ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐ ఏ ఎస్ స్టడీ సర్కిల్ నందు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్ ,ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.కాగా కుటుంబ వార్షికాదాయం 3 లక్షలు మించరాదని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 30 లోగా స్టడీ సర్కిల్.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇతర వివరాల కొరకు పై వెబ్‌సైట్ తో పాటు టిడబ్ల్యూడి.తెలంగాణ.జిఓవి.ఇన్ నందు చూసుకోవచ్చని,మరిన్ని వివరాలకు 6281766534 ఫోన్ నెంబర్‌కు సంప్రదించవచ్చని అంబాజీ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

కామారెడ్డిటౌన్, జూన్ 13: పట్టణంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఎనుగుర్తి పుష్పవ్వ(45)బుధవారం రాత్రి పిడుగుపడి మృతిచెందిందని దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు.గ్రామానికి చెందిన కాసర్ల రాజారాం పోలం వద్దకు కూలీ పనికి వెళ్లగా అక్కడ పనిచేస్తుండగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఉరుములు,మెరుపులతో వర్షం రాగా అదే సమయంలో పిడుగుపడి చనిపోయిందని తెలిపారు. మృతురాలి కూమారుడు ఎనుగుర్తి అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

భిక్కనూరు, జూన్ 13: చాపలు పట్టెందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారీ పడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆకుల నర్సింలు(56) బుధవారం స్థాని బొబ్బిలి చెరువులో గాలాలతో చెపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో భార్య కిష్టవ్వకు చెప్పి వెళ్లాడు. రాత్రి అయిన నర్సింలు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోయింది. ఉదయం బస్టాండ్ పక్కన ఉన్న బొబ్బిలి చెరువులో నర్సింలు మృతదేహం బయటకు తేలడంతో స్థానికులు పోలీసులకు, నర్సింలు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య కిష్టవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్శన్ - మహారాజ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి - మనమే
వెంకటేశ్వర - గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

